క్లుప్తంగా

బీసీ చైతన్య సమితి ఉపాధ్యక్షుడిగా నాగరాజు



హిందూపురం: పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కొల్లకుంట నాగరాజు బీసీ చైతన్య సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

నేడు మండల మీట్

రొద్దం: మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరుకావాలని సూచించారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి



రొద్దం పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మంజువాణి

రొద్దం: ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మంజువాణి ఆదేశించారు. సోమవారం ఆమె మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఫార్మసిస్ట్ గదిలో మందులను పరిశీలించారు. మండలంలోని తురకలాపట్నం హెల్త్ సబ్ సెంటరును కూడా తనిఖీ చేశారు. మందులు, రోగుల వివరాలు, పలు రికార్డులు పరిశీలించారు.

విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

గుడిబండ: ఖరీఫ్‌లో సాగుచేసే రైతులు ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాల కోసం రైతు భరోసా కేంద్రాల్లో పేరు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి తిమ్మప్ప సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, మొబైల్‌ఫోన్ తప్పకుండా వెంట తీసుకువెళ్లాలన్నారు. 30 కిలోల బస్తా సబ్సిడీ పోను రూ.1,674 ప్రకారం అందజేస్తామన్నారు.

చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం



చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం చేస్తున్న దృశ్యం

పెనుకొండ: పేదల ఇళ్ల స్థలాలపై వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం పెనుకొండలో చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. పేదలపై చంద్రబాబు విద్వేషాన్ని పెంచుకున్నారని, అందుకు ప్రస్తుత వ్యాఖ్యలే నిదర్శనమని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ బోయ నరసింహ, మండల కన్వీనర్ నాగలూరు బాబు, నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, వైస్ చైర్మన్ సునీల్, కౌన్సిలర్లు రామాంజనేయులు, భాస్కర్‌నాయక్, తయాబ్, బోయ హారతి, రేపటి నాగరత్న, అంజలి, బోయబాబు, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.


ఉన్నత విద్యలో రాణించండి



మాట్లాడుతున్న ఆర్‌జేడీ నాగలింగారెడ్డి

పెనుకొండ: విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించాలని డిగ్రీ కాలేజీల రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) నాగలింగారెడ్డి సూచించారు. సోమవారం ఆయన పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రికార్డులను, తరగతులను నిశితంగా పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. సింగిల్ సబ్జెక్ట్ గురించి వివరించారు. కళాశాల ప్రగతికి ప్రిన్సిపాల్ నీలం రమేష్‌రెడ్డి చేస్తున్న కృషిని అభినందించారు.

ఘనంగా భగీరథ విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి

హిందూపురం: హిందూపురం మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన భగీరథ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చౌళూరు మధుమతిరెడ్డి హాజరైయ్యారు. విగ్రహావిష్కరణ అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వలంటీరు వ్యవస్థ దేశానికే ఆదర్శం

- సత్కార కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకరనారాయణ

గోరంట్ల: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ, వార్డు సచివాలయ, వలంటీరు వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. ఈ వ్యవస్థ ద్వారా కుల, మత, రాజకీయాలకు అతీతంగా పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. వలంటీర్లు మరింత బాధ్యతగా పనిచేసి అర్హులైన పేదలందరికీ పథకాలు అందేలా చూడాలన్నారు. సోమవారం గోరంట్లలోని ఓ ఫంక్షన్ హాలులో ప్రతిభ కనబరిచిన వలంటీర్లకు అవార్డుల ప్రదానంతో పాటు సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ హయాంలో పేదలకు పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీలకు కప్పం కట్టాల్సి ఉండేదన్నారు.



వలంటీరుకు అవార్డు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. వలంటీర్ల ద్వారా పేదల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు గుర్తు చేశారు. అనంతరం మండలంలోని గౌనివారిపల్లి సచివాలయ వలంటీర్ సునీల్ కుమార్ రెడ్డి, గోరంట్ల రెండో సచివాలయంలో పనిచేస్తున్న షేక్ షాహినాకు సేవా వజ్ర అవార్డులను ప్రదానం చేశారు. చంద్రశేఖరరెడ్డి (పాలసముద్రం), శ్రీవేణి (పులేరు), అరుణమ్మ (గంగంపల్లి), కుమారి అరుణ (కమ్మవారిపల్లి), భారతి (గోరంట్ల సచివాలయం-3)లకు సేవారత్న అవార్డు అందజేశారు. అలాగే మండలంలోని 368 మంది వలంటీర్లకు సేవామిత్ర అవార్డులు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రమీల, జెడ్పీటీసీ సభ్యుడు పాలే జయరాంనాయక్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ బాషా, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, పట్టణ కన్వీనర్ ధనుంజయరెడ్డి, గోరంట్ల మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు నూర్ మహమ్మద్, మండల ఉపాధ్యక్షులు నాగభూషణరెడ్డి, ఎంపీడీఓ రఘునాథగుప్తా, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



ఉష్ణోగ్రత సమాచారం

(గరిష్టం)

హిందూపురం : 37.0
పెనుకొండ : 39.0
మడకశిర : 37.0

'నాగభూషణరెడ్డిపై చర్యలు తీసుకోండి'

పెనుకొండ: సోమందేపల్లి మండలం ఈదులబళాపురం గ్రామానికి చెందిన నాగభూషణరెడ్డిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని అదే గ్రామానికి చెందిన సింగిల్‌విండో అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డీఎస్పీ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో నాగభూషణరెడ్డి దౌర్జన్యాలు అధికమయ్యాయన్నారు. గడ్డివాములకు నిప్పు పెట్టడం, భయభ్రాంతులకు గురిచేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

ఎమ్మెల్యేని విమర్శించే స్థాయా నీది?

అమరాపురం: ఎమ్మెల్యే తిప్పేస్వామిని విమర్శించే స్థాయి నీకు లేదు.. నీ అంతూ చూసే వరకూ వదలమని జిల్లా ఎస్సీ సెల్ టీడీపీ అధ్యక్షుడు సీసీగిరి మంజునాథ్‌ను అమరాపురం మండల దళిత సంఘం నాయకులు నారాయణ, ప్రసాద్, తిప్పయ్య, సురేష్, హెచ్చరించారు. సోమవారం స్థానిక తిప్పయ్య షాపులో సింగిల్ విండో అధ్యక్షుడు చిక్కన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు త్రిలోక్‌నాథ్, సోమశేఖర్, రాజప్ప, తదితరులు సమక్షంలో దళిత నాయకులు మాట్లాడారు. టీడీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ ఎమ్మెల్యే తప్పేస్వామి అంతు చూస్తా, ఖబర్దార్, లాంటి పదాలు వాడుతున్నారని తెలిపారు. దీన్ని తాము ముక్తకంఠంతో ఖండిస్తున్నామన్నారు. నియోజకవర్గ అభివృద్ధిని చూసి ఓర్వలేకనే విమర్శలు చేస్తున్నారన్నారు.

మడకశిర: టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్ దళిత వర్గానికి చెందిన ఎమ్మెల్యే తిప్పేస్వామిని కించపరిచే విధంగా మాట్లాడడం సరికాదని ఎమ్మార్పీస్ నాయకులు అంజినప్ప, శివప్ప, సత్య, రామాంజినేయులు, అంజి, చందు, మూర్తి అన్నారు. సోమవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ అగ్రకులానికి చెందిన నాయకుడికి మద్దతుగా దళితులను అవమానం పరచడం మానుకోవాలని సూచించారు.



అమరాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

చెరువుల్లో పూడికతీతతో భూగర్భజలాల పెంపు



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

మడకశిర రూరల్: చెరువుల్లో పూడికతీతతో నీటి నిల్వ సామర్థ్యం పెరిగి భూగర్భ జలాలు పెంపొందుతాయని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి తెలిపారు. సోమవారం ఆయన ఆమిదాలగొంది చెరువులో 'అమృత్ సరోవర్' పథకం కింద జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడి సౌకర్యాలు, కూలి గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 'అమృత్ సరోవర్' పథకం కింద ఉపాధి నిధులతో చెరువులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. పూడిక తీత వల్ల నీటి నిల్వ పెరిగి బోరుబావుల్లో భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. పనులను కూలీలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. పనులు చేసే చోట కూలీలు ఇబ్బంది పడకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కవిత, సర్పంచ్ గీత, వైఎస్సార్‌సీపీ నాయకులు, ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో రైతు ఆస్పత్రిపాలు

పావగడ: తాలూకాలోని వైఎన్ హొసకోటలోని బీ బ్లాక్‌లో మురుగు కాలువ మరమ్మతులో భాగంగా బెస్తరపల్లికి వెళ్లే ప్రధాన రోడ్డులో గ్రామ పంచాయతీ అధికారులు గుంతలు తవ్వించారు. గత 5 రోజులుగా ఆ గుంతలు అలాగే ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇందులో భాగంగానే గౌడతిమ్మనహళ్లి గ్రామం నుంచి ఆనంద్ అనే రైతు ద్విచక్ర వాహనంలో ఆదివారం రాత్రి వైఎన్ హొసకోటకు వస్తుండగా మార్గమధ్యలోని రోడ్డులో ఉన్న గుంతలు కనిపించక ద్విచక్ర వాహనంతో పాటు రైతు కూడా గుంతలో పడిపోయారు. బాధితుడి ఎడమ చేయి, రెండు మోకాళ్ల చిప్పలు దెబ్బ తినడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన జరిగిన తర్వాత అధికారులు యుద్ధ ప్రాతిపదికన గుంతలు మూసివేయించారు.



చికిత్స పొందుతున్న రైతు ఆనంద్

గాలీవాన బీభత్సం

లేపాక్షి: మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి గాలీవాన బీభత్సం సృష్టించడంతో పెద్ద పెద్ద వృక్షాలతో పాటు విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. కల్లూరు, కొండూరు, నాయనిపల్లి తదితర గ్రామాల్లో రోడ్డుకు ఉన్న చెట్లు భారీగా పడిపోయాయి. కల్లూరు గ్రామానికి చెందిన లక్ష్మీదేవమ్మ అనే రైతుకు చెందిన మల్బరీ షెడ్డుకు వేసి ఇనుప రేకులు, ఇనుప కమ్మీలు గాలికి సుమారు 500 మీటర్లు దూరానికి ఎగిరిపోయాయి. రూ.3.50 లక్షలు నష్టం వచ్చిందన్నారు. అలాగే మండల వ్యాప్తంగా 18 విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో ఆదివారం రాత్రంతా విద్యుత్ సరఫరా అధికారులు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

విద్యుత్‌శాఖకురూ.18.50 లక్షల నష్టం

హిందూపురం: హిందూపురం విద్యుత్ డివిజన్ వ్యాప్తంగా ఆదివారం వీచిన గాలీవానలకు విద్యుత్‌శాఖకు రూ.18.50 లక్షలు నష్టం వాటిల్లినట్లు ట్రాన్స్‌కో డీఈ భూపతి తెలిపారు. పలుచోట్ల 11 కేవీ విద్యుత్ స్తంభాలు, 61 చోట్ల ఎల్‌టీ లైన్లు, పది ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయని చెప్పారు. అయితే అత్యవసరంగా విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది ఆదివారం రాత్రి పనులు చేసి సరఫరాను పునరుద్ధరించినట్లు వివరించారు. దెబ్బతిన్న లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కూడా వేగంగా మరమ్మతు చేపట్టినట్లు వివరించారు.



దూరంగా పడిపోయిన రేకులు, కమ్మీలు

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

పావగడ: తాలూకాలోని వెంకటాపురం గ్రామంలో కురుబల ఆరాధ్య దైవమైన రేవణ సిద్ధేశ్వర మండి మారప్ప దేవాలయంలో మండి మారప్ప స్వామి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివమొగ్గకు చెందిన వేద పండితుడు కారగోడ్ల గురుమూర్తి భట్, రాజేశ్ స్వామి, మంజునాథ్ నేతృత్వంలో హోమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి మంజునాథ్, ఆలయ సమితి పదాధికారులు గేట్ అంజినప్ప, కురుబ రామచంద్ర, నారాయణ స్వామి, ధర్మకర్త హెచ్ ధర్మపాల్, జాజు సుబ్బరాయప్ప, శివరామయ్య, వీఎల్ డబ్ల్యూ రామాంజనప్ప తదితరులు పాల్గొన్నారు.

కండీషన్‌లో ఉంటేనే ఫిట్‌నెస్ సర్టిఫికెట్



బస్సు డ్రైవర్లకు సూచనలిస్తున్న డీటీఓ కరుణసాగర్‌రెడ్డి

హిందూపురం: విద్యాసంవత్సరం ప్రారంభం అవుతున్న తరుణంలో పాఠశాల, కళాశాల బస్సులు కండిషన్‌లో ఉంటేనే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇస్తామని డీటీఓ కరుణాసాగర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఆర్టీఓ కార్యాలయంలో స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై ఆర్టీఓ అధికారులు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బస్సు డ్రైవర్లు, కండక్టర్లకు నిబంధనలు వివరిస్తూ సలహాలు సూచనలిచ్చారు. అనంతరం ఎంవీఐ రమణ బస్సులను నడిపి ఫిట్‌నెస్ పరిశీలించారు.

దుద్దేబండలో జ్యోతులు

పెనుకొండ రూరల్: మండలంలోని దుద్దేబండ గ్రామంలో సోమవారం జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. ముందుగా ఆంజనేయ స్వామి, అక్కమ్మ గార్లకు గ్రామ ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు జ్యోతులు సమర్పించారు. గ్రామ భద్రత, శాంతి, సౌభాగ్యాల కోసం తొమ్మిదేళ్లకోసారి జ్యోతుల ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అలాగే మంగళవారం గ్రామ దేవతలైన పెద్దమ్మ, ముత్యాలమ్మలకు బోనాలు సమర్పించనున్నారు.



జ్యోతులతో వెళ్తున్న మహిళలు

జగనన్న పాలనకే ప్రజల మద్దతు

- ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు
- ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

మడకశిర రూరల్: కుల, మత రాజకీయాలకు అతీతంగా రాష్ట్రంలో పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, అందువల్లే జనమంతా జగనన్న సంక్షేమ పాలనకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి తెలిపారు. మండల పరిధిలోని ఏఆర్ రొప్పం గ్రామ సచివాలయం పరిధిలోని డీ రామగిరి గ్రామంలో సోమవారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రతి ఇంటికి కలిసిన లబ్ధికి సంబంధించిన బుక్‌లెట్‌ను అందించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామంలో ప్రజలు తెలిపిన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎంగా ఉంటేనే తమకు మేలు జరుగుతుందని ప్రజలంతా భావిస్తున్నారన్నారు. అందువల్లే వైఎస్ జగన్‌కు మరోసారి మద్దతుగా నిలిచి సీఎంగా చేసుకుంటామని ముక్తకంఠంతో చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కవిత, సర్పంచ్ గీత, జెడ్పీటీసీ సరోజమ్మ, సింగల్ విండో అధ్యక్షుడు రామిరెడ్డి, వైస్ ఎంపీపీ మూర్తి, మాజీ ఎంపీపీ బజ్జప్ప, నాయకులు సత్యానారాయణ జమ్మానిపల్లి మూర్తి, శ్రీరామరెడ్డి, రంగనాథ్, శ్రీరామప్ప, సచివాలయ కన్వీనర్ల, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



డీ రామగిరిలో ఓ లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

ఈమె పేరు నాగరత్నమ్మ. మడకశిర మండలం డీ రామగిరి గ్రామం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన నవరత్నాల పథకాలతో ఆమె కుటుంబానికి ఎంతో లబ్ధి కలిగింది. వైఎస్సార్ చేయూత కింద రూ.37.500, పింఛన్ కానుక ద్వారా రూ.82,000, రైతు భరోసా కింద రూ.40.500, పంటల బీమా పథకం వల్ల రూ.4,522 చొప్పున మొత్తంగా రూ.1.64.522 లబ్ధి కలిగింది. ఇటీవలే అధికారులు వైఎస్సార్ జలకళ బోరు మంజూరు చేశారు. ఇంటి పట్టాతో ఇళ్లను మంజూరు చేశారు. దీంతో తమ కుటుంబానికి భరోసా కల్పించిన సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటామని నాగరత్నమ్మ చెబుతున్నారు.



సంక్షిప్త సమాచారం

కురుబ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

హిందూపురం టౌన్: కురుబ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కురుబ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలాజీ, స్థానిక అధ్యక్షుడు రెడ్డప్ప ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో 450కి పైగా మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, 475కి పైగా మార్కులు సాధించిన ప్రైవేటు స్కూళ్ల విద్యార్థులు, ఇంటర్‌లో ప్రభుత్వ కళాశాలలో చదివి 800లకు పైగా మార్కులు సాధించిన వారు, ప్రైవేటు కళాశాలల్లో చదివి 850కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులు, ఎన్ఈఈటీ, జేఈఈలో అత్యుత్తమ ప్రతిభా కనబరిచిన వారు అర్హులన్నారు. వివరాలకు 9440975466 నంబర్లో సంప్రదించాలన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

మడకశిర: పట్టణంలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణపు పనులను సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మతో పాటు అధికారులు పరిశీలించారు. ఎస్ఎఫ్‌సీ నిధులు రూ.1.70 కోట్లు, గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.60 లక్షలతో సీసీ రోడ్డు పనులను మున్సిపాలిటీ పరిధిలో చేపట్టారు.

ఆటోబోల్తా..పలువురికి గాయాలు

మడకశిర: పట్టణ సమీపంలోని చౌటుపల్లి వద్ద సోమవారం ఆటో బోల్తా పడగా, పలువురు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. సోమవారం మడకశిర నుంచి ప్రయాణికులతో రేకులకుంట గ్రామానికి బయలుదేరిన ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలు కాగా, లక్ష్మీనరసప్ప అనే వ్యక్తి రెండు కాళ్లు విరిగిపోయాయి. అతని పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హిందూపురం ఆస్పత్రికి తరలించారు. మిగతా క్షతగాత్రులను మడకశిర ఆస్పత్రికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ నిర్మాణ కమిటీ ఎంపిక

హిందూపురం: పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యుల ఎంపిక సోమవారం జలదుర్గమ్మ ఆలయంలో జరిగింది. గౌరవధ్యక్షుడిగా జేఇ వెంకటస్వామి, అధ్యక్షుడిగా రాఘవేంద్ర, ఉపాధ్యక్షుడిగా రామాంజినేయులు, అంబికా రఘునాథ్, కార్యదర్శిగా రాము, సంయుక్త కార్యదర్శిగా సూర్యనారాయణ, కోశాధికారిగా సుధాకర్‌తో పాటు 11 మంది డైరెక్టర్లను ఎంపిక చేశారు.

విద్యార్థుల కోసం బస్సులు నడపండి

రొద్దం: మండలంలోని వివిధ గ్రామాల నుంచి రొద్దం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వచ్చే విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో వివిధ గ్రామాల ప్రజలు వినతి పత్రం సమర్పించారు. దొడగట్ట గ్రామం నుంచి ఆర్టీసీ బస్సు తప్పకుండా నడపాలని కోరారు.

నేడు ఏఆర్ రొప్పంలో 'గడప గడపకూ'

మడకశిర రూరల్: మండల పరిధిలోని ఏఆర్ రొప్పం గ్రామంలో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి ఆధ్వర్యంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ గీత, ఎంపీపీ కవిత తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, వలంటీర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

లేపాక్షికి 1002 క్వింటాళ్ల వేరుశనగ

లేపాక్షి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మండలానికి కే6 రకం వేరుశనగ విత్తనకాయలను ఇప్పటి వరకు 1002 క్వింటాళ్లు నిల్వ చేసినట్లు ఏఓ శ్రీలత తెలిపారు. అన్ని ఆర్‌బీకే కేంద్రాల్లో నాణ్యమైన విత్తన వేరుశనగ అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. వేరుశనగ విత్తనకాయల నాణ్యతను సర్పంచ్ ఆదినారాయణ సోమవారం పరిశీలించారు.

25న జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం

మడకశిర: ఇటీవల వెలువడిన పది, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఈ నెల 25న ఉదయం 10 గంటలకు స్థానిక ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నియోజకవర్గ స్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ భాస్కర్ తెలిపారు. పదో తరగతిలో నియోజకవర్గ స్థాయిలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు చొప్పున నగదు బహుమతులు అందజేస్తామన్నారు. అదే విధంగా ఇంటర్‌లో గ్రూపుల వారీగా నియోజకవర్గస్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.15 వేలు చొప్పున నగదు బహుమతి అందించి వారి తల్లిదండ్రులను సన్మానించనున్నట్లు వెల్లడించారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చిలమత్తూరు: మండలంలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ రామ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలో మొత్తం 5 పోస్టులు ఖాళీ ఏర్పడ్డాయన్నారు. పలగలపల్లి -4 , మొరసలపల్లి -1 పోస్ట్ ఖాళీగా ఉన్నాయన్నారు. 26 లోపు ఆన్‌లైన్ ద్వారా అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.


ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి

మడకశిర: మండలంలోని కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్లు చేసుకుంటున్నాయని, వెంటనే అలాంటి ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం స్థానిక సీఐ సురేష్‌బాబు, తహసీల్దార్ బాలంజినేయులుకి ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రాలిచ్చారు. ప్రభుత్వం ముందస్తు అడ్మిషన్లు చేసుకోకూడదని ప్రత్యేకంగా జీఓ ఇచ్చినా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారన్నారు. వెంటనే పోలీసులు, అధికారులు చర్యలు తీసుకుని ముందస్తు అడ్మిషన్లను ఆపాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఈరేశ్, నాయకులు నరేంద్ర, అనిల్ పాల్గొన్నారు.

అమృత్ సరోవర్ పనులు పూర్తి చేయాలి

రొళ్ల: చెరువు అభివృద్ధిలో భాగంగా అమృత్ సరోవర్ కింద చేపట్టిన పూడికతీత పనులను ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని ఏపీడీ జయసింహ సిబ్బందికి సూచించారు. సోమవారం సాయంత్రం మండలంలోని హొట్టేబెట్ట పంచాయతీ పరిధిలోని నాయకనకట్టలో అమృత్ సరోవర్ కింద చేపట్టిన చెరువు పూడికతీత అభివృద్ధి పనులను ఎంపీడీఓ రామారావుతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఓ నాగరాజు, టీఏలు, ఎఫ్ఏలు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి జ్యోతులు



జ్యోతులు తీసుకువస్తున్న దృశ్యం

మడకశిర రూరల్: మండల పరిధిలోని చెందకచెర్ల గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి సోమవారం భీమరాయనపల్లి గ్రామ మహిళలు భక్తి శ్రద్ధలతో జ్యోతులు సమర్పించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. మంగళవారం మారెమ్మ దేవతకు జ్యోతుల ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రామ ప్రజలు తెలిపారు.

'మా పెట్రోల్ బంకులో రూ.2 వేల నోటు చెల్లదు'

చిలమత్తూరు: రూ.2 వేల నోట్ల రద్దును ప్రకటిస్తూ ఆర్బీఐ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. కానీ ఆ నోట్లు సెప్టెంబర్ 30 వరకూ చెలామణి చేసుకోవచ్చని ఆర్బీఐ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో మండలంలో దుకాణాల్లో రూ.2 వేల నోటు తీసుకోవడానికి యజమానులు నిరాకరిస్తున్నారు. మండలంలోని టీడీపీ మండల కన్వీనర్ రంగారెడ్డికి చెందిన పెట్రోల్ బంక్‌లో వినియోగదారులు 2 వేలు నోటు తీసుకువస్తే ఇక్కడ పనిచేసే సిబ్బంది వెనక్కి పంపుతున్నారు. దీనిపై పెట్రోల్ బంక్ యజమాని రంగారెడ్డిని 'సాక్షి' వివరణకోరగా.. రూ.2 వేల నోటు రద్దు తర్వాత బ్యాంక్‌ల ద్వారా 20 వేలు నగదు మాత్రమే మార్చుకునే అవకాశం ఉంది .. అందుకే ముందు జాగ్రత్తగా పెట్రోల్ బంక్‌లో రూ. వేల నోట్లు తీసుకోవడం లేదన్నారు. అయితే తమకు రూ.2 వేల నోట్లు తీసుకోవద్దనిగాని, తీసుకొమ్మని గాని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ నుంచి ఎలాంటి ఆదేశాలు లేవని ఆయన చెప్పడం కొసమెరుపు.

25న వాహనాల వేలం

హిందూపురం: హిందూపురం సెబ్ పోలీసుస్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను 25న ఉదయం 11 గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు సెబ్ సీఐ స్వర్ణలత తెలిపారు. వేలంలో పాల్గొన దలచిన వారు ఆధార్‌కార్డు జిరాక్స్‌లు వెంట తెచ్చుకోవాలని సూచించారు.